

సభలో సీటీ రవిని అడ్డు కుంటున్న మార్షల్స్



శాసనసభలో అంబేడ్కర్ ఫొటోలు ప్రదర్శిస్తున్న డీసీఎం డీకే శివకుమార్, సభ్యులు



పరిషత్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రతిపక్ష సభ్యులు

అంబేడ్కర్‌ను అవమానించింది.. మీరే..!



- అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం
- చివరిరోజు సభ రసాభాస
- అంబేడ్కర్ ఫొటోలతో ఇరు పక్షాల నిరసన
- ప్రధానికి రాజ్యాంగంపై చిత్తశుద్ధి లేదు : కాంగ్రెస్ ధ్వజం
- ఉత్తర కర్ణాటక సమస్యలను పక్కదారి పట్టించేందుకే: బీజేపీ

బెంగళూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు చివరిరోజు రసాభాసగానే ముగిశాయి. గురువారం ఉదయం ప్రారంభం నుంచే శాసనసభ, విధానపరిషత్‌లలో దుమారం రేగింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో అంబేడ్కర్‌కు సంబంధించిన వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు విరుచుకుపడ్డారు. శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంబేడ్కర్ ఫొటోలను తమ టేబుళ్లపై ఉంచి నిరసన తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలపై సమగ్ర చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు ప్రతిగా బీజేపీ సభ్యులు విరుచుకుపడ్డారు. అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్ వారేనన్నారు. అంబేడ్కర్ ఫొటో పట్టుకునేందుకు కాంగ్రెస్‌కు అర్హత లేదని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. ఇదే సందర్భంలోనే విజయేంద్రతోపాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ ఎంపీ పదవికి అంబేడ్కర్ రాజీనామా చేసిన సమయంలో అప్పటి ప్రధాని నెహ్రూ వ్యాఖ్యలను కేంద్రమంత్రి ప్రస్తావించారన్నారు. అంబేడ్కర్‌ను బీజేపీ ఎప్పటికీ అవమానించలేదన్నారు. బీజేపీ సభ్యుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్ మాట్లాడుతూ ఢిల్లీలోని అంబేడ్కర్ నివాసం పంచతంత్రను సందర్శించి రావాలన్నారు. దశాబ్దాలకాలంగా నివాసం ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకోవాలని ఒకసారి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెళ్లిరావాలన్నారు. స్మారకం ఎలా మార్చారనేది తెలుసుకోవాలన్నారు. వాజ్‌పేయ్ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్నానని, ఎప్పుడూ రాజ్యాంగానికి అవమానం చేసేలా బీజేపీ వ్యవహరించలేదన్నారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానాలను కాంగ్రెస్ దాచిందని అప్పట్లో నెహ్రూ ఏమేం చేశారనేది ప్రజలకు తెలుసునన్నారు. ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చించాలనే డిమాండ్ దారి తప్పించేందుకే ఈ అంశం తెరపైకి తెచ్చారన్నారు.

సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనసులోని మాటలను అమిత్‌షా చెప్పారని అంతకు మించి వారినుంచి ఏం ఆశించవచ్చునని విరుచుకుపడ్డారు. అంబేడ్కర్‌కు అవమానం చేసిన విషయాన్ని ఇప్పటికే లేఖ రాశామన్నారు. ప్రశ్నోత్తరాలకు సమయం ఇవ్వాలని ఆ తర్వాత పరిశీలిస్తామని స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. దీంతో వివిధ అంశాలపై చర్చ జరిగింది. అటవీ హక్కు చట్టం కింద 16,665మందికి హక్కు పత్రాలు ఇచ్చామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. సభ్యుడు శాంతారాం గుడ్డసిద్ధి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో అనధికారికంగా నివసిస్తున్న 24మంది పాకిస్తాన్, 159మంది బంగ్లాదేశీయులను అరెస్ట్ చేశామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. గ్యారెంటీ పథకాలకు అభివృద్ధి నిధులకు కోత లేదని సీఎం సిద్దరామయ్య తెలిపారు. పరిషత్‌లో సభ్యుడు సీటీ రవి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కృష్ణ ఎగువ ప్రాజెక్టును అంచలంచెలుగా పూర్తి చేస్తామని డీసీఎం డీకే శివకుమార్ పరిషత్‌లో తెలిపారు. సభ్యుడు పీహెచ్ పూజార్ అడిగిన ప్రశ్నకు డీసీఎం సమాధానమిచ్చారు. అబ్కారీశాఖలో అధికారులు, ఉద్యోగుల బదిలీలలో అవినీతి జరగలేదని మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర సభ్యుడు కేఎస్ నవీన్ ప్రశ్నకు బదులిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో 9,695కు గాను 5,977లను భర్తీ చేశామని ప్లానింగ్, గణాంకాలశాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. నైస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని మద్దూరులో ప్రారంభించే అంశం పరిశీలనలో ఉందని డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. భీమా నదిలో నీటి కేటాయింపులకు సంబంధించి కర్ణాటక, మహారాష్ట్రల మధ్య చర్చలు జరగాల్సి ఉందన్నారు.

బాలింతల మృతిపై విచారణ

బళ్ళారితోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బాలింతల మృతిపై న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ జరుపుతామని, తప్పు చేసినవారిపై చర్యలు తప్పవని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. బళ్ళారిలో 34 మందికి సిజేరియన్లు జరగగా ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు.




మాట్లాడుతున్న స్పీకర్

అమిత్‌షా గుజరీ వ్యాపారి అయ్యేవారు

- రాజ్యాంగమే ఆయనకు పదవులను కట్టబెట్టింది : సీఎం

బెంగళూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం లేదంటే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గుజరీ వ్యాపారి అయ్యేవారని సీఎం సిద్దరామయ్య తీవ్ర ఆరోపణలు గుప్పించారు. గురువారం శాసనసభలో సీఎం మాట్లాడుతూ రాజ్యసభ సభాపతి జగదీప్ ధనకర్ రాజ్యాంగ నిబంధన కింద వెంటనే అమిత్‌షాను సభనుంచి సస్పెండ్ చేయాల్సి ఉండేదన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలలో ఆశ్చర్యం లేదని, బీజేపీ, సంఘ్‌పరివార్‌ల ఆలోచనలు అలాంటివన్నారు. రాజ్యాంగం లేనిపక్షంలో అమిత్‌షా పల్లెల్లో గుజరీ వ్యాపారం చేసుకుని ఉండాల్సిందని, కేంద్ర హోం మంత్రి అయ్యేవారు కాదన్నారు. అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉండేదన్నారు. కేంద్ర మంత్రి పదవినుంచి తొలగించాలన్నారు. 1927 డిసెంబరు 25న మనుస్మృతిని బహిరంగంగా కాల్చివేసిన అంబేడ్కర్ 22ఏళ్ల తర్వాత దేశంలో సమానత్వానికి అవసరమైన రాజ్యాంగాన్ని రచించారన్నారు. అంబేడ్కర్ పట్ల ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ద్వేషం ఇదేమి కొత్త కాదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థాపకుల కేశవ బలరామ్ హెడగేవార్ ఆయన ఉత్తరాధికారి మాధవ సదాశివ గోళ్వాల్కర్, సావర్కర్‌లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినవారేనన్నారు. 1949 నవంబరు 30న అంబేడ్కర్ రాజ్యాంగాన్ని దేశానికి సమర్పించారన్నారు. ఆ తర్వాత నాలుగు రోజులకు ఆర్‌ఎస్‌ఎస్ ఎడిటోరియల్‌లో విమర్శించారని అదే నేటికీ వారు పాటిస్తారన్నారు. వారి తీరులో మార్పు ఉండదని మండిపడ్డారు.



అంబేడ్కర్ ఫొటోతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌కు అవమానం జరిగిందనే అంశంపై పరిషత్‌లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తలెత్తిన వాగ్వాదం తారస్థాయికి చేరి ఏకంగా బీజేపీ సీనియర్ సభ్యుడు సీటీ రవి అరెస్టుకు కారణమైంది. అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానం చేశారని సమగ్ర చర్చకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యుడు బీకే హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యులమధ్య వాగ్వాదానికి కారణమైంది. ఇదే సందర్భంలోనే సభాపతి బసవరాజ హొరట్టి జోక్యం చేసుకుని కలాపాలను సజావుగా జరిగేందుకు అవకాశం కల్పించాలని కోరినా ప్రయోజనం లేకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను ఉద్దేశించి సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ సభ్యులు సీటీ రవిపై విరుచుకుపడ్డారు. ఒకానొకదశలో ప్రతిపక్ష గ్యాలరీవైపు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా మార్షల్స్ అడ్డుకున్నారు. లక్ష్మీ హెబ్బాళ్కర్ సోదరుడు, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహొళి తీవ్రస్థాయిలో దూషించారు. ఒకానొక దశలో సీటీ రవిపై దూసుకొచ్చి దాడి చేసేందుకు ప్రయత్నించారు. వీరిని కట్టడి చేయడం మార్షల్స్‌కు సవాల్‌గా మారింది. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కూడా తీవ్రంగా మండిపడ్డారు. మీకు తల్లీభార్య కూతుళ్లు లేరా... ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా... అంటూ విరుచుకుపడ్డారు. డీసీఎం డీకే శివకుమార్ సహా మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు సీటీ రవిని ఉద్దేశించి దూషించారు. అక్కడనుంచి సీటీ రవి సభనుంచి బయటకు రాగా మంత్రి అనుచరులు విరుచుకుపడి దాడికి ప్రయత్నించారు. మార్షల్స్ అడ్డుకుని గేట్‌లకు తాళాలు వేశారు. గేట్‌లను తన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా మంత్రి పట్ల తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అయినా సువర్ణసౌధలోనే దాడికి ప్రయత్నించారంటూ సీటీ రవి అక్కడే బైఠాయించి నిరసనకు దిగారు. గేట్ వద్ద ఆయన కారును అడ్డుకునే ప్రయత్నం జరిగింది. ఈలోగా డీసీఎం డీకే శివకుమార్ సహా కీలక నేతలు మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తో పాటు పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి చాంబర్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సభాపతి స్పందించి ఆడియో, వీడియోలను పరిశీలించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇలా సాగుతుండగానే మంత్రి బెళగావిలోని హిరేబాగేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాత్రి 7 గంటలకు సీటీ రవిని అరెస్టు చేశారు. బీజేపీ సభ్యులను ప్రత్యేక వాహనాలలో సువర్ణసౌధ నుంచి తరలించారు.



సువర్ణసౌధ ప్రాంగణంలో సీటీ రవిపై దాడికి యత్నిస్తున్న మంత్రి అనుచరులు

మహిళా మంత్రిపై సీటీ రవి అనుచిత వ్యాఖ్యలు

- సభలో విరుచుకుపడ్డ కాంగ్రెస్
- దాడికి యత్నించిన మంత్రి అనుచరులు
- కారును అడ్డుకున్న వీరంగం
- హెబ్బాళ్కర్ ఫిర్యాదుతో బీజేపీ నాయకుల అరెస్టు



పరిషత్‌లో అంబేడ్కర్ ఫొటోలతో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, మహిళా సభ్యులు



రోడ్డుపై టమోటాలను పడేస్తున్న రైతులు

టమోటా @ 2

నిన్న మొన్నటి దాకా కిలో రూ.20, 30 పలికిన టమోటా ధరలు అమాంతం రూ.2కు పడిపోవడంతో రైతుల ఆవేదనకు అంతు లేకుండా పోయింది. అమ్ముకోలేక పండ్లను రోడ్డు పైనే పారబోస్తున్నారు.

రూ.15 వేలు లంచం తీసుకుంటూ..

- లోకాయుక్తకు పట్టుబడిన అధికారి

8



సరిహద్దు శక్తినగర్ చెక్‌పోస్టు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సరిహద్దు వద్ద రైతుల నిరసన

రాయచూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు, యాదగిరి జిల్లాలకు చెందిన రైతులు తెలంగాణ మార్కెట్‌కు ధాన్యం తరలిస్తుండగా అధికారులు అడ్డుకోవడం ఆందోళనకు దారి తీసింది. రాష్ట్రంలో వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పలువురు రైతులు ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నారు. అయితే గత మూడు రోజులుగా జిల్లా సరిహద్దులోని శక్తినగర్ చెక్‌పోస్టు వద్ద 10 ధాన్యం లారీలు నిలిచిపోయాయి. దీంతో కర్ణాటక రైతు సంఘం నాయకులు గురువారం శక్తినగర్ వద్ద ఆందోళన చేపట్టారు. దాదాపు గంటకు పైగా ఈ మార్గంలో వాహన సంచారం నిలిచిపోగా వ్యవసాయ శాఖ అధికారులు జోక్యం చేసుకుని రైతులను శాంతిపచేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వ్యవసాయ శాఖ అధికారి కర్ణాటక నుంచి తెలంగాణకు ధాన్యం రవాణ పై ఎలాంటి నిషేధం లేదని ఈ విషయంలో తెలంగాణ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అక్షరజాతరకు సర్వం సిద్ధం

- సమ్మేళనాధ్యక్షుడు గో.రు.చన్నబసప్పకు సాదర స్వాగతం
- 18 దేశాలనుంచి కన్నడిగులు .. కిటల్ వంశస్థుల భాగస్వామ్యం



గో.రు.చన్నబసప్పను సత్కరిస్తున్న మంత్రి చలువరాయస్వామి

బెంగళూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చక్కెరనాడు మండ్యలో జరిగే 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి సర్వం సిద్ధమైంది. మండ్య నగర వీధులలో వెలుగులు విరాజిల్లుతున్నాయి. ఎటు చూసినా భారీ హోర్డింగ్‌లు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నగర శివారులోని శ్రీనివాసపుర వద్ద భారీ వేదికను ఏర్పాటు చేశారు. సాహిత్య సమ్మేళనానికి సుమారు 80 ఎకరాలలో మూడు వేదికలను సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు సమ్మేళనం జరగనుంది. సీఎం సిద్దరామయ్యతోపాటు కేబినెట్ మంత్రులు, సాహితీవేత్తలు పాల్గొననున్నారు. అక్షరజాతరకు రోజూ వేలాదిమంది భాగస్వామ్యులు అవుతారని భావించి వారందరికీ భోజనం తదితర సౌలభ్యాలు సిద్ధం చేశారు. మండ్య, మైసూరు ప్రాంత రుచులతోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాల రుచులను సిద్ధం చేస్తున్నారు. వందకుపైగా ఫుడ్ కౌంటర్‌లు సిద్ధమయ్యాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

సాదర స్వాగతం

అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు గో.రు.చన్నబసప్ప (గొండనహళ్లి రుద్రప్ప) గురువారం సాయంత్రం మండ్యకు చేరుకోగా సాదరంగా స్వాగతించారు. మంత్రి చలువరాయస్వామితోపాటు ఎమ్మెల్యేలు రవిగణిగ, నరేంద్ర, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషితోపాటు జిల్లా ప్రముఖులు పాల్గొన్నారు.

హావేరి తీర్మానాల అమలు ఎప్పుడో...?

- రెండేళ్ల నాటి వాటిలో నాలుగింటికి మోక్షం లేదు
- కన్నడ పోరాట నేతలపై కేసుల తొలగింపు మరిచారు..

కన్నడ సాహిత్య సమ్మేళనం అంటే కేవలం సాహితీవేత్తల పరిచయంలాంటి పండుగ కాదు. కన్నడ భాష, సంస్కృతి, నీరు, నేల, సరిహద్దుతోపాటు ఎన్నో అంశాలపై చర్చించే వేదికగా కొనసాగుతుంది. ప్రతి సమ్మేళనంలోనూ తదుపరి ఎక్కడ జరపాలనే అంశంతోపాటు పలు కీలకమైన సమస్యలపై తీర్మానాలు ఉంటాయి. ఇలా 2022లో హావేరిలో జరిగిన 86వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం ఆరు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో రెండు నిర్ణయాలు జారీ చేసినా సంపూర్ణంగా అమలు కాలే దు. గతంలో సాహిత్య సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వ స్థాయిలో అమలు చేయడం లేదని సమ్మేళనానికి పరిమితంగా మారిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి దుకాణంతోపాటు అన్ని నామఫలకాలపై 60శాతం కన్నడ తప్పనిసరిగా ఉండాలని తీర్మానించారు. ఈ అంశంపై కేబినెట్‌లోనూ చర్చించి తీర్మానించారు. అయితే సంపూర్ణంగా అమలు కావడం లేదు.

హావేరి సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలలో కన్నడ భాషాభివృద్ధి బిల్లుకు ఆర్డినెన్స్ జారీ చేసి చట్టం రూపంలో తీసుకొచ్చి విద్య, న్యాయ వ్యవస్థ పాలనా వ్యవహారాలలో సంపూర్ణంగా అమలు చేయాలని తీర్మానించారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు వివాదానికి సంబంధించి మహాజన్ నివేదికతోపాటు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సమ్మేళనంలో తీర్మానించారు. కన్నడ కోసం పోరాటం చేసినవారిపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించాలని కీలకమైన అంశంగా ఉండేది. కేసుల రద్దు అంశం పలుమార్లు శాసనసభలో చర్చ జరిగినా అమలుకు నోచుకోలేదు. రాజ్యాంగం 8వ నిబంధనకు అనుగుణంగా ప్రాంతీయభాషకు సమానమైన గుర్తింపు ఇవ్వాలని, హిందీతోపాటు ఇతరత్రా భాషల ఒత్తిడి నివారించాలని సమ్మేళనంలో తీర్మానించారు. విశ్వకన్నడ సమ్మేళనాన్ని దావణగెరెలో జరపాలని నిర్ణయం తీసుకున్నారు. సాహిత్య సమ్మేళనాలు జరిపిన అనుభవం ఉన్న కన్నడ సాహిత్య పరిషత్ ద్వారానే అమలు చేయాలని తీర్మానించారు.

18 దేశాలనుంచి ప్రవాస కన్నడిగులు

- కిటల్ వంశస్థుల భాగస్వామ్యం

మండ్యలో జరగనున్న అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి 18దేశాలనుంచి 250 మందికిపైగా ప్రవాస కన్నడిగులు హాజరు కానున్నారు. అమెరికా, యూరప్, ఆసియా పసిఫిక్, కొల్లితో పాటు వివిధ దేశాలనుంచి ప్రవాస కన్నడిగులు సమ్మేళనంలో పాల్గొనేందుకు వస్తున్నట్లు ఇప్పటికే సమాచారం అందిచాఅరు. సాహితీవేత్త 'పు.తి.న' కుమార్తె అలమేలు, కన్నడ సాహిత్య పరిషత్ సంస్థాపకులలో ఒకరైన కర్పూర శ్రీనివాసరావు మనవరాలు నిర్మలా కపూర్, కన్నడ తొలి నిఘంటు రూపకర్త ఫర్డినెంట్ కిటల్ వంశస్థులు కార్యక్రమంలో భాగస్వామ్యులు అవుతున్నారు. సమ్మేళనంలో 21మంది ప్రవాస కన్నడిగులను సత్కరించనున్నారు. ఇందులో కన్నడ సేవలో మూడు పర్వదినాలు జరిపే అమెరికా కన్నడ సంఘాలు ఉన్నాయి. తొలిసారి విదేశాల్లో కన్నడ భవనాన్ని నిర్మించిన బహ్రెయిన్ కన్నడ సంఘంతోపాటు ఆస్ట్రేలియా దేశం మెల్‌బోర్న్‌లోని కన్నడ సంఘానికి, 60ఏళ్లుగా సేవలందిస్తున్న చికాగో యూనివర్సిటీ కన్నడ పీఠానికి గౌరవించదలిచారు. మండ్యకు చెందిన నవలా రచయిత్రి త్రివేణి రచించిన 'శరపంజర' నవలను ఇటలీ భాషా అనువాదాన్ని విడుదల చేయనున్నారు. త్రివేణి కుమార్తె మీరాశంకర్ భాగస్వామ్యులు అవుతున్నారు. యూరప్ రాష్ట్రాల ఔత్సాహిక రచయితలు 'సప్త సముద్రాలకు అటువైపు ఎక్కడో' అనే రచనను ఆవిష్కరించనున్నారు. ప్రవాస కన్నడిగులకోసమే 22న 9.30 గంటలకు ప్రత్యేక గోష్ఠి ఏర్పాటు చేశారు. అమెరికాకు చెందిన అమరనాథగౌడ అధ్యక్షతన జరిగే గోష్ఠిలో బహ్రెయిన్‌కు చెందిన కిరణ్ ఉపాధ్యాయ ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు. ఖత్తార్‌కు చెందిన హెచ్‌కే మధు, ఇంగ్లండ్ అశ్విన్ శేషాద్రి, జర్మనీకి చెందిన రష్మినాగరాజ్ నివేదికలు సమర్పించనున్నారు. ప్రవాస భారతీయ సమన్వయ అధికారి ఆరతి కృష్ణ పర్యవేక్షించనున్నారు.





నరసింహస్వామి ఆలయంలో మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

ఖాద్రీశుడి సేవలో మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

బెంగళూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నరసింహస్వామిని కర్ణాటక మాజీ స్పీకర్, మాజీ మంత్రి కేఆర్ రమేశ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతించారు. స్వామివారి దర్శనానంతరం తీర్థప్రాదాలు, శేషవస్త్రం అందచేశారు. ఆయన వెంట వెంట కోలారు జిల్లా కాంగ్రెస్ నాయకులు సంజయ్‌రెడ్డి, మోహన్ గాంధీ, రాయల్ భాస్కర్ తదితరులు ఉన్నారు. ఆలయ అధికారులు శ్రీహరిప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు.

కారు దూసుకెళ్ళి ఇద్దరి దుర్మరణం

- ముగ్గురి పరిస్థితి విషమం
- చత్తీస్‌ఘడ్‌కు చెందిన యువతులుగా గుర్తింపు

హోసూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా డెంకణీకోట పరిధిలోని బి.శెట్టిపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు దుర్మరణం చెందారు. కెలమంగలం పోలీసులు తెలిపిన వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో వాహనాల విడిభాగాలను తయారు చేస్తారు. ఇందులో 500 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో వంద మందికి పైగా ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు ఉన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన జయశ్రీ (22), శాంత (20), మాధురి , అస్మిత, కరణ్ సితార్ ఐదుగురు బుధవారం రాత్రి షిఫ్ట్‌ను ముగించుకుని ఇళ్లకు నడుచుకుంటూ వెళ్తున్నారు. డెంకణీకోట నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు దూసుకెళ్లడంతో జయశ్రీ, శాంత అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన మాధురి, అస్మిత, కరణ్‌లను స్థానికులు హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. డెంకణీకోట డీఎస్పీ ఆనందరాజు, కెలమంగలం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జయశ్రీ (ఫైల్)



ప్రమాదస్థలంలోని దృశ్యం



శాంత(ఫైల్)



తూట్రాళ్లపల్లిలో..



కూలితే ఎంత ప్రమాదమో..?

కూలేందుకు సిద్ధంగా..

తూట్రాళ్లపల్లిలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

యాడికి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో విద్యుత్‌స్తంభాలు ఒకవైపు ఒరిగిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని రైతులు, అటువైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు నేల కొరిగిన విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించేలా లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాయలచెరువులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాయలచెరువులో...



తూట్రాళ్లపల్లి-నగరూరు మధ్య

డీఎంహెచ్‌ఓపై లోకాయుక్తకు ఫిర్యాదు

అనంతపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) భ్రమరాంబికా దేవిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆమె చేసిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఉరవకొండ సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే సిబ్బందికి ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులిస్తే సంతకాలు చేస్తున్నారని, లేనిపక్షంలో చేయడం లేదని వాపోయారు. ఈ అంశాలతోపాటు అనేక అవినీతి ఆరోపణలకు సంబంధించి లోకాయుక్తకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ఆధారాలను అందజేశానన్నారు. వాటిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు కోదండరామిరెడ్డి తెలిపారు.



ఆగిపోయిన షాదీఖానా నిర్మాణ పనులు

నిర్లక్ష్యానికి నిదర్శనాలు



పిల్లర్ దశలో ఉన్న ఇండోర్ స్టేడియం

ఉరవకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా పట్టణంలోని ముస్లిం షాదీఖానా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇండోర్‌స్టేడియం దర్శనమిస్తున్నాయి. మైనార్టీశాఖ ఆధ్వర్యంలో 2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం పనులు చేపట్టారు. అప్పట్లో రూ.20లక్షల పనులు కూడా పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ పాలనలో అప్పటి మైనార్టీ శాఖమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే 2018లో రూ.2కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రూ.10లక్షల వ్యయంతో శ్లాబ్ స్థాయివరకూ పిల్లర్ నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ నిర్మాణాన్ని ఆపేసింది. అప్పటి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు.

రబీ సాగుకు సన్నద్ధం

ఉత్సాహంగా పొలం పనులు

టీబీ డ్యాంలో నీటి నిల్వపై రైతుల హర్షం



బొమ్మనహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలతో నీరు సమృద్ధిగా లభిస్తుండడంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో వర్షాలు లేక నారుకు ట్యాంకర్ల ద్వారా, బిందెలతో తడిపిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి తుంగభద్ర జలాశయం, చెరువులు నిండడంతో రైతులు రబీలో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షానికి దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆ నష్టాల నుంచి కోలుకునేందుకు రబీకి సిద్ధమవుతున్నారు. వరి సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలో ఖరీఫ్ వరి సాగు తుదిదశకు చేరుకుంటోంది. రైతులు వరి కోతలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రావటంతో ధాన్యం ఆరబోసి కాటాలు వేసి మిల్లులకు తరలిస్తున్నారు. స్థానికంగా నాణ్యమైన విత్తనాలు లేక రైతులు కర్ణాటకలోని కంప్లి, గంగావతి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నారు సాగు చేసుకున్నారు. మండల పరిధిలోని లింగదహాళ్, రంగాపురం క్యాంప్, శ్రీధరఘట్ట, గోనేహాళ్, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో వరి సాగు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ కోతలు పూర్తి కాకుండానే తక్కువ కాలంలో వచ్చే నారు చల్లుకున్నారు. ఖరీఫ్‌లో 17 వేల ఎకరాలపైగా వరి పంట సాగు చేశారు. రబీలో 12 వేల ఎకరాల్లో సాగుకు సిద్ధమవుతున్నారు.

రెండోసారి వరి సాగు చేస్తున్నా

నాకు ఉన్న ఆరు ఎకరాల పొలంలో నాలుగు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నాను. ఇప్పటికే వరి నారు పోసుకున్నాను. ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తే ఎకరాకు 45 బస్తాలు దిగుబడి వచ్చింది. ధర లేకపోవడం వల్ల పెద్దగా లాభం లేదు. తుంగభద్ర జలశయంలో నీరు ఉండడం, వ్యవసాయ బోర్ల కింద రెండోసారి పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నాను.



- తిప్పేస్వామి, లింగదహాళ్

రెండో పంటకు సాగునీరివ్వాలి



ఖరీఫ్‌లో ఎనిమిది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే కోత సమయంలో నేలకొరిగి రూ. 40 వేలు నష్టం జరిగింది. రెండో పంటకు బోరుబావులు కింద వరిపంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నాం. ఇప్పటికే వరినారు పోసుకున్నాం. తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నాయి. రెండో పంటకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రబీసీజన్‌లో వరి పంట బాగా పండితే మా పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తా.

- రాము, ఉప్పరహాళ్ క్రాస్

సాగుకు నారు సిద్ధం చేశా..



రబీసీజన్‌లో 10 ఎకరాల్లో వరిసాగుకు నారు పోసుకున్నాం. నా సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు చేస్తున్నా. వర్షం వల్ల కొంత వరకు పంట నష్టం జరిగింది. పంట నమోదు కాలేదని ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. బయటి వ్యాపారులకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ ధర కన్నా తక్కువకు విక్రయించాను. పంట నమోదు కాని రైతుల ధాన్యం కూడా కొనుగోలు చేస్తే బాగుండేది.

- రామాంజనేయులు, ఉద్దేహాళ్

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు



రబీలో వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు లాభదాయక పంటలను గుర్తించుకుని సాగుచేయాలి. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు తీసుకుని రబీలో పంటలు సాగు చేయాలి. ఆరుతడి పంటలు సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

- సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్



వేరుకుళ్లు తెగులు సోకి ఎండిపోతున్న పప్పుశనగ పంట

పప్పుశనగకు వేరుకుళ్లు దెబ్బ

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటకు వేరుకుళ్లు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి భూముల రైతులకు ఈ పంటే జీవనాధారం. సాగు చేసి రెండు నెలలు గడుస్తుండడంతో పంట పూత దశలో ఉంది. ఈ యేడాది మండల వ్యాప్తంగా 16,600 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు బాగా కురవడంతో పైర్లు ఏపుగా పెరిగాయి. పైరు కళకళలాడుతుండడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశించిన రైతులకు తెగులు ఆందోళన కలిగిస్తోంది. వేరుకుళ్లు తెగులు సోకి మొక్కలన్నీ నల్లబారి చనిపోతున్నాయి. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించినా పంటంతా నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో పంట దెబ్బతింటుందని ఒక వైపు దిగులు పడుతుండగా.. తెగులు సోకడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

తెగుళ్లు నీరుగారుస్తున్నాయి



వర్షాలు బాగా కురిసి పైర్లు ఏపుగా పెరిగాయి. దిగుబడులు బాగావస్తాయని ఆశగా ఉన్నాం. ఈ పరిస్థితుల్లో వేరుకుళ్లు సోకి పైరంతా నాశనమవుతోంది. ఎంత ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోతోంది. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతాం.

- దామోదర, రైతు, తగ్గుపర్తి

తేమశాతం అధికమై చనిపోతున్నాయి



భూమిలో తేమ శాతం అధికంగా ఉన్నందున వేర్లన్నీ నల్లబారి మొక్కలు చనిపోతున్నాయి. దీనికి పంట మార్పిడి చేయకపోవడం కూడా ఒక కారణం. సాఫ్ 400 గ్రాములు ఎకరానికి, ప్రోపికోనోజల్ 400 గ్రాములు ఎకరానికి, పైరు తడిచేలా పిచికారి చేయాలి. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

- పృథ్వీసాగర్, వ్యవసాయాధికారి, బెళుగుప్ప

న్యూస్‌బాక్స్

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గుంటూరు లైన్ డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో వెళ్లే పలు రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గనపల్లి సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య వర్కుల కారణంగా పూరి-యశ్వంతపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం. 22883) రైలును 20వ తేదీన, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22884)ను ఈనెల 21న, హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22831) రైలును ఈనెల 25న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22832)ను ఈనెల 20న, భువనేశ్వర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 02811) రైలును ఈ నెల 21న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 02812)ను ఈ నెల 23న డోన్-గుత్తి మీదుగా కాకుండా నంద్యాల, యర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం/ధర్మవరం స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు.

23 నుంచి న్యాయవిద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలోని న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 23నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గురువారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్కేయూ క్యాంపస్ లా డిపార్ట్‌మెంట్‌తోపాటు విజయనగర లా కాలేజ్ విద్యార్థులకు ఏక కాలంలో పరీక్షలుంటాయన్నారు. వీరందరికీ ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల బీబీఏ, బీకామ్ ఎల్ఎల్‌బీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు. ఎల్ఎల్ఎం ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలుంటాయని వివరించారు. అదేవిధంగా మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ, హానర్స్ విద్యార్థులకు ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లుగా 23 నుంచి 30వర కు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

అనంతపురం టౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రహణం మొర్రి పిల్లల కోసం శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయబాల ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజరు రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రి డాక్టర్ల సహకారంతో పెదవిచీలిక, గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాధిత చిన్నారులకు ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి: ఈయూ



ప్రసంగిస్తున్న ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఐదేళ్లుగా నిలుపుదల చేసిన ఉద్యోగోన్నతులను వెంటనే కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి నిలుపుదల చేసిన నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకోసం ఇచ్చిన సర్క్యులర్ నం.పీడీ-1/2019ను కొంతమంది అధికారులు పక్కన పెట్టారని, విపరీతంగా పనిష్మెంట్లు ఇస్తున్నారని అన్నారు. వెంటనే సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్, జిల్లా కార్యదర్శి పీఎస్ ఖాన్, మహిళా నాయకురాలు నాగమణి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఏపీ జేఏసి అమరావతి జిల్లా అధ్యక్షుడు ఆర్ఎన్ దివాకర్, కొండయ్య, గోపాల్, ఓబుళరత్నం, రామాంజనేయులు, కల్లప్ప, ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఎన్ఎంయూఏతోనే సమస్యల పరిష్కారం'



రమణారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంయూఏతోనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. వైసీపీ హయాం నుంచి ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఎంయూఏ నాయకులు రమణారెడ్డిని అనంతపురం ఆర్ఎం కార్యాలయం వద్ద గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ... కార్మికుల అనేక సమస్యలపై ఎన్ఎంయూఏ పోరాటాలు చేపట్టి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని అన్నారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నైటవుట్ అలవెన్సుల చెల్లిపుకోసం జీఓ జారీ చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, అనిత, ఈశ్వరప్ప, అనంతపురం డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెలాఖరు దాకా గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంటనష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600లు చెలిస్తే రూ.32వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు చెలిస్తే రూ.32వేలు బీమా వర్తిస్తుందన్నారు. జొన్న పంటకు ఎకరాకు రూ.315లు చెలిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.525లు చెలిస్తే రూ.35వేలు, వరి పంటకు ఎకరాకు రూ.630లు చెలిస్తే రూ.42వేలు, పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.450లు చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. ఇదివరకు ఈనెల 15వతేదీ వరకు గడువు ఉండిందని, రైతుల సౌకర్యార్థం ఈనెలాఖరు దాకా ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫైనల్స్‌కు

ఎస్ఎస్‌బీఎన్.. బ్లూమూన్

అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలలో ఎస్ఎస్‌బీఎన్, కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆర్డీటీ స్టేడియంలో గురువారం సెమీఫైనల్స్ నిర్వహించారు. తొలి పోరులో అనంతపురం వివేకానంద డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో కదిరి జట్టు 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. సాయిప్రణీత్ 162 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన వివేకానంద 8.4 ఓవర్లలోనే 71 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో సెమీస్‌లో ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్ఎస్‌బీఎన్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 150, జయకృష్ణ 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్వీ డిగ్రీ కాలేజి 7.3 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌట్ అయింది. కదిరి బ్లూమూన్, ఎస్ఎస్‌బీఎన్ జట్ల మధ్య ఫైనల్ పోరు శుక్రవారం జరగనుంది. ఎస్కే యూనివర్శిటీ రెక్టార్ వెంకటనాయుడు, ఎస్వీ డిగ్రీ కాలేజీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ పీడీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్, పీడీలు శ్రీరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి



ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తున్న సానా సతీష్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 20వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని దివ్యాంగ క్రికెట్ ఆంధ్రా అసోసియేషన్ కన్వీనర్ రోషిరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం అమరావతిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ చేతుల మీదుగా ప్రారంభించారు. 20వ తేదీన పేర్ల నమోదు పూర్తి చేసి, 21న ఎంపిక ప్రక్రియ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. వివరాల కోసం 9703400870, 7780167625, 6305354511 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా ఎంపికయ్యారు. జనవరి 4 నుంచి త్రివేండ్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమ లింగారెడ్డి వారిని అభినందించారు.



అర్షియా



నేహా

టోల్ పెంపును రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో రెండు నేషనల్ టోల్‌గేట్‌ల మీదుగా ప్రయాణించే వాహనదారులపై వేల రూపాయల భారం పడుతోందన్నారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో కట్టబెడుతున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందని, దీనికితోడు ఆర్అండ్‌బీ రోడ్లపై టోల్ ప్రవేశపెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇది ప్రజలపై పెనుభారమవుతుందని తెలిపారు. ఈ మొత్తం టోల్ విధానాన్ని సమీక్షించి, తక్షణమే భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉంటే, వాటిలో 65 టోల్‌ప్లాజాలలో సింగిల్ ఎంట్రీ విధానం తీసుకువచ్చి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ రుసుములు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీనివల్ల సొంత, బాడుగ వాహనదారులపై అధికభారం పడుతుందన్నారు. ఈ విధానం వల్ల అద్దెవాహనాలు నడుపుకునేవారిపై తీవ్ర ప్రభావం పడి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదముందన్నారు. అనంతపురం-గుత్తి మధ్య గత సెప్టెంబరు వరకు ఒక కారు ఒకసారి వెళ్లి తిరిగి వచ్చినందుకు రూ.160లు చెల్లించేవారని, ఒకసారి టోల్ చెల్లించిన తర్వాత 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం రూ.160ల ఫీజును రూ.240లకు పెంచి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240లు చెల్లించేలా భారం మోపారన్నారు. ఇదే తరహాలో అన్నిరకాల వాహనదారులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో టోల్ చార్జీల పెంపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జనవరి 19వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది కార్గో సేవలు, డోర్ డెలివరీ విధానం గురించి ప్రజలందరికీ తెలియపరిచి, సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 2021 సెప్టెంబరు 1 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సదుపాయం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో అనంతపురంతోపాటు గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో డోర్ డెలివరీ విధానం అందుబాటులో ఉందని, 50 కేజీల బరువు వరకు పార్శిల్ బుకింగ్స్‌ను పార్శిల్ కౌంటర్‌కు 10కిలోమీటర్ల పరిధిలోపు గల వినియోగదారుల ఇళ్లవద్దకే చేర్చడం జరుగుతుందన్నారు. కార్గో సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన తీసుకొచ్చి, మాసోత్సవాలను విజయవంతం చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.

తప్పుల సవరణకు 23 వరకు అవకాశం

అనంతపురం విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల వివరాల తప్పుల సవరణకు ఈనెల 23వ తేదీ వరకు విద్యాశాఖ అవకాశం కల్పించినట్లు డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. దీనికి సంబంధించిన విద్యార్థుల నామినల్ రోల్స్(ఎన్ఆర్) వివరాలు ఏవైనా తప్పుగా నమోదై ఉంటే...వాటిని ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ సవరించడానికి పరీక్షల విభాగం డైరెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

యామినీ కృష్ణమూర్తి (జయంతి)



శాస్త్రీయనృత్య కారిణిగా దేశంలో పేరొందిన నర్తకీమణులలో ఒకరైన యామినీ కృష్ణమూర్తి 1940 డిసెంబరు 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లిలో జన్మించారు. అటుపై వారి కుటుంబం తమిళనాడు రాష్ట్రంలోని చిదంబరంలో స్థిరపడింది. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీల నృత్యాలలో నిష్ణాతురాలు. వేలాది ప్రదర్శనలతో ప్రత్యేకించి కూచిపూడి నృత్యానికి దేశ విదేశాలలో వన్నె తెచ్చారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, నాట్యశాస్త్ర ఇతర గౌరవాలు అందుకున్నారు. టీటీడీలో ఆస్థాన నర్తకిగా గుర్తింపు పొందారు. కాగా తన జీవితాన్ని నాట్య రంగానికి అంకితం చేయడం కోసం పెళ్లి చేసుకోలేదు. 2024 ఆగస్టు 3న కన్నుమూశారు.

సుగుణ వరదాచారి (పుట్టినరోజు)



కర్ణాటక గాత్ర సంగీతంలో పేరొందిన సుగుణ వరదాచారి 1945 డిసెంబరు 20న తమిళ నాడు రాష్ట్రం ధారాపురంలో జన్మిం చారు. ఆలిండియా రేడియో చెన్నై లో ఏ గ్రేడ్ కళాకారిణిగా పలు కర్ణాటక సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. అంతే కాక వీణావాదనలో సత్తా చాటుకున్నారు. గాయనిగా, సంగీతం ఉపాధ్యాయురాలిగా రాణించి సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా ఆచార్య అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. మద్రాస్ యూనివర్సిటీలో 20ఏళ్లపాటు ఫ్యాకల్టీగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ సంగీత సదస్సులలో పాల్గొన్నారు. 2023లో ముద్ర అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుకున్నారు.

మేఘనారెడ్డి (పుట్టినరోజు)



రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో పేరొందిన గుండ్లపల్లి మేఘనారెడ్డి 1998 డిసెంబరు 20న హైదరాబాద్‌లో జన్మించారు. పదేళ్లపాటు ఈ రంగంలో తర్ఫీదు పొందారు. ఇటలీలో జరిగిన ఐదో ఫ్రెండ్లీ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. హూప్ కేటగిరీలో కాంస్యం సాధించారు. 2018లో ఆస్ట్రేలియాలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌కు దేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన ఏకైక రిథమిక్ జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందారు. ప్రస్తుతం పెన్సిల్వేనియా యూనివర్సిటీలో హయ్యర్ ఎడ్యుకేషన్ చదువుతున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

గార్లదిన్నె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో కొందరు యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గార్లదిన్నెకు చెందిన నాగార్జున, జగదీష్, రామ్మోహన్‌రెడ్డి, నాగులగుడ్డం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ దాబా సమీపంలో మద్యం సేవించారు. మాటామాటా పెరిగి గొడవ పడ్డారు. ఘర్షణ తారస్థాయి చేరి ఒకరినొకరు కొట్టుకున్నారు. నలుగురూ గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన రామ్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. నాగార్జున, జగదీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

చిలమత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు మధుపై అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. చిలమత్తూరు పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను లైంగికంగా వేధిస్తుండేవాడు. బాలిక.. విషయాన్ని తల్లికి చెప్పింది. బాలిక తల్లిని కూడా మధు బెదిరించడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం దీనిపై పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో మధు నేరం చేసినట్లు రుజువవడంతో న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

▸▸ రాజీనామా చేయాలని పలువురి డిమాండ్



రాస్తారోకోలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్‌పట్ల కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానంగా మాట్లాడారంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. బంగారపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటైన నిరసనకు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల తీరు అంతేనన్నారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ విరోధి అని, పేదల వ్యతిరేకి అని ఆరోపించారు. నిరసనలో బంగారపేట బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రకుమార్, పార్థసారథి, శంషుద్దీన్‌బాబు, పురసభకు చెందిన కాంగ్రెస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ.. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

బాగేపల్లి: రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని రాష్ట్రప్రాంత కూలీల సంఘం, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేశాయి. గురువారం పట్టణంలో కేంద్రమంత్రికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రాంత కూలీలసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునివెంకటప్ప మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ సమాన హక్కులు, అన్నివర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించిన అంబేడ్కర్ పట్ల అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. నిరసనలో రామలింగప్ప, రఘురామరెడ్డి, సావిత్రమ్మ, అశ్వత్థప్ప, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో కూలీలసంఘం, ఎస్ఎఫ్ఐల నిరసన

ఆదర్శరైతులను ప్రోత్సహించడమే లక్ష్యం



వివిధ రంగాల సాధకులకు సన్మానం

బాగేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదర్శంగా ఎదిగేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎస్‌బిఐ మేనేజర్ మారుతేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోనిని గూళూరులో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అన్నదాత మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన కిసాన్‌గోష్టిలో పాల్గొని మాట్లాడుతూ గూళూరులో త్వరలోనే నగదు డిపాజిట్, డ్రా చేసే సీడీఎం ఏటీఎంను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రత్యేకించి పాడిపెంపకంలో ఉత్తమ సాధన ఉండడం గర్వకారణమన్నారు. ఇదే సందర్భంగా ప్రగతిపర రైతులను, వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో గూళూరు ఎస్‌బిఐ మేనేజర్ రమేశ్, బాగేపల్లి ఎస్‌బిఐ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, దేవనహళ్ళి వెంకటేశ్, పశు వైద్యశాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల నాటి యదార్థసంఘటనలతో 'స్వయంభు'

▸▸ టాలీవుడ్ నటుడు నిఖిల్ సిద్ధార్థ

మహదేవపుర, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వెయ్యేళ్లక్రితం మధ్య భారత దేశంలో జరిగిన యదార్థఘటనల ఆధారంగా స్వయంభు రూపుదిద్దుకుంటోందని టాలీవుడ్ నటుడు, కార్తికేయ ఫేం నిఖిల్ సిద్ధార్థ వెల్లడించారు. స్థానిక మారతహళ్ళిలో ఏర్పాటైన 'ఆం-తె-రా' రెస్టారెంట్ ప్రారంభానికి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. నిఖిల్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ స్వయంభు, కార్తికేయ-3, ది ఇండియన్ హౌస్ అనే చిత్రాలు నిర్మాణదశలో ఉన్నాయన్నారు. వీటిలో 'స్వయంభు' సినిమాలోని ఓ సన్నివేశం కోసం గడ్డం పెంచినట్టు వివరించారు. వచ్చే మార్చిలో విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. అద్భుతమైన సినిమా చూశామన్న భావన ప్రేక్షకులకు కలుగుతుందన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాయలసీమ పదాలనుంచి ఒక్కో అక్షరాన్ని తీసుకుని రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాన్యం ఆశిష్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డి, నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నటుడు నిఖిల్ సిద్ధార్థతో రెస్టారెంట్ నిర్వాహకులు, అభిమానులు

డిమాండ్ల సాధనకై కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



నిరసనలో కాంట్రాక్టు ఉద్యోగులు

దొమ్మసంద్ర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర సమీపాన చిక్కనహళ్ళి మార్గంలోని సాబిక్ టెక్నాలజీ సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకై గురువారం నిరసన తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కేపీసీసీ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా కార్మికుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నానని ఇటీవల కొన్ని నెలలుగా స్థానికులు, కన్నడిగులంటూ తారతమ్యం చూపుతున్నారని దీన్ని ప్రశ్నిస్తే పని వదులుకోవాలని బెదిరిస్తున్నారని వాపోయారు. ఏడాదికోసారి బోనస్ ఇవ్వడం లేదని, కార్మికులకు గ్రాట్యుటీ, బీమా సదుపాయం లేదన్నారు. హౌస్‌కీపింగ్ పనిచేసే లక్ష్మి మాట్లాడుతూ పదేళ్లుగా పనిచేస్తున్నానని ఇక్కడ ఎలాంటి సదుపాయాలు లేవన్నారు. కంపెనీ ఉద్యోగులతో కలసి నీరు, కాఫీ తాగేందుకు వీలు లేదన్నారు. తమకోసం వేరుగా శౌచాలయం ఉందని, తారతమ్య ధోరణితో మానసిక వేధింపులు ఉన్నాయని వాపోయారు. నిరసనలో జయకర్ణాటక సంఘం యువ విభాగం నవీన్‌కుమార్, కార్మికులు విజయ్‌కుమార్, హరీశ్, శివకుమార్, సతీశ్, విజికుమార్, చేతన్ వెంకటేశ్, మోహన్, అనుసూయ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

యువత కొత్త ప్రపంచాన్ని సృష్టించాలి

▸▸ బీఎన్ఎంఐటీలో ప్రోత్సాహకాల పంపిణీలో దేబబ్రత దాస్

బెంగళూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కొత్త ప్రపంచాన్ని సృష్టించేలా ఎదగాలని భూమి సాఫ్ట్‌వేర్ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ దేబబ్రతదాస్ పిలుపునిచ్చారు. బిఎన్ఎంఐటి కళాశాలలో గురువారం విద్యార్థులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఉన్నత విద్య సరళీకృతమైందని ప్రపంచమంతటా ఉద్యోగాలు పొందేలాంటి కోర్సులు ప్రతిచోటా సాధ్యమన్నారు. బిఎన్ఎంఐటి చారిటీ చైర్మన్ నారాయణరావు మానెతోపాటు ట్రస్టు సభ్యులు ఈశ్వర్ ఎన్ మానె, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వై కులకర్ణి, భూమి సాఫ్ట్‌వేర్ హెచ్ఆర్ సుమిత్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. రూ.51.10 లక్షల ప్రోత్సాహకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.



ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో దేబబ్రతదాస్ తదితరులు

హలో.. నేను సీఐడీ ఆఫీసర్‌ను..!

పుట్లూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఎవరండీ అగ్రిగోల్డ్ భూముల విషయంలో మాట్లాడేది..? నేను కర్నూలు నుంచి సీఐడీ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..' అంటూ ఓ సర్వేయర్ హల్‌చల్ చేస్తున్నాడు. 'మీకు ఏమి సమాచారం కావాలన్నా నన్ను అడగండి..' అంటూ కొందరిని బెదిరిస్తున్నటుల సమాచారం. మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆ భూముల జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తామని అక్కడకు వెళ్లిన వామపక్ష నాయకులను, చూసేందుకు వెళ్లిన అధికారులను వైసీపీ నాయకుడు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని, ఇప్పుడు వెళ్లమంటే ఎలా అంటూ మండిపడుతున్నాడు. దీంతో అధికారులు ఏమీ చేయలేకున్నారు. ఈ క్రమంలో ఓ సర్వేయర్ ఆ భూములు మొత్తం తన పరిధిలోనే ఉన్నాయంటూ హంగామా చేస్తున్నాడు.

అగ్రిగోల్డ్ భూములను వైసీపీ నాయకుడు సాగు చేస్తున్న విషయం తెలిసినా జిల్లా అధికారులు, సీఐడీ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ఆంధ్రజ్యోతి కథనాలతో కొందరు అధికారులు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేసినా.. బెదిరింపులతో మిన్నకుండిపోతున్నారని సమాచారం. ఆ ప్రాంతానికి వెళ్లిన వామపక్ష, ప్రజా సంఘాల నాయకులకు ఓ సర్వేయర్ సీఐడీ ఆఫీసర్ అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుడే దగ్గరుంచి ఫోన్ చేయిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. వంద ఎకరాలకుపైగా అగ్రిగోల్డ్ భూములు సాగుచేస్తున్న వైసీపీ నాయకుడు కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తగ్గడం లేదు. ఉన్నతాధికారులతో సయోధ్య కోసం టీడీపీ నాయకులద్వారా రాయబేరాలు నడుపుతున్నట్లు తెలిసింది.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

శిడ్లఘట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవర మళ్ళూరు గ్రామంలో గ్రామదేవత మళ్ళూరాంభదేవి బ్రహ్మ రథోత్సవం పురస్కరించుకుని బాలాజి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్ర గౌడ మాట్లాడుతూ ఈసారి జారతలో కబడ్డీ పోటీలతోపాటు రంగవల్లులు, కోలాటం వంటి గ్రామీణ సొబగును చాటే కార్యక్రమాలు సాగడం సంతోషంగా ఉందన్నారు. ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ, తృతీయస్థానాల్లో వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, నాల్గో స్థానం జట్టుకు రూ.5వేల నగదు, ట్రోఫీ ప్రదానం చేశారు. 22కుపైగా జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సీకల్ ఆనందగౌడ, కంబదహళ్ళి సురేంద్రగౌడ, ఆంజనేయగౌడ, కన్నప్పనహళ్ళి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజేతల వివరాలను ప్రకటిస్తున్న ప్రముఖులు

భక్తిశ్రద్ధలతో సంకష్టచతుర్థి పూజలు



ద్విముఖ గణపతికి అలంకరణ

శిడ్లఘట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్విముఖ గణపతి ఆలయంలో సంకష్టచతుర్థి పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి అభిషేకం, అలంకరణ అనంతరం సంకష్టచతుర్థి పూజలు జరిగాయి. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పురోహితుడు కృష్ణమూర్తి, సోదరులచే ధార్మిక కార్యక్రమాలు సాగాయి. భక్తులతోపాటు విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల గురించి జగన్ మాట్లాడటం విడ్డూరం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న సమయంలో రైతు సంక్షేమం మరిచిపోయిన జగన్‌రెడ్డి.. నేడు రైతుసంక్షేమం గురించి మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి ప్యాలెస్‌లో కూర్చొని విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ , రైతు పెట్టుబడి సాయంపై మాట్లాడటం మానుకోవాలన్నారు. జగన్ తన ప్రభుత్వ హయాంలో మూరెడు డ్రిప్పు పైపు ఇవ్వలేని దద్దమ్మ ముఖ్య మంత్రిగా చరిత్రలో మిగిలిపోయాడన్నారు. ఐదేళ్ళ కాలంలో రైతుల సంక్షేమం కాని, వారి కష్టాల గురించి ఏనాడూ పట్టించు కోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 13.52లక్షల ఎకరాల విస్తీర్ణం సాగు తగ్గిందన్నారు. ఐదేళ్లల్లో సొంత కార్యకర్తలనే గాలికొదిలేసిన జగన్ రెడ్డి... ఇప్పుడు బయటకు వస్తే తన సొంత కార్యకర్తలే భరతం పడతారని భయపడి ప్యాలెస్ వదిలి బయటకు రావడం లేదన్నారు.

ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్నారని మందలించినందుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన పూలశెట్టి సురేష్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు. ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి, చేతికి రాడ్ వేశారు. ఆ ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రతి రోజు మద్యం తాగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించేవారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అనంతపురం సంఘమిత్ర కాలనీకి చెందిన షేక్ షెక్షావలి(26) గురువారం ఉరి వేసుకున్నాడు. షెక్షావలి బొరుగుల వ్యాపారి. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు చెప్పినా మారలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం 7గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు.

అప్పుల ఒత్తిడితో..

అనంతపురం నగరంలోని శారదానగర్‌కు చెందిన సోమశేఖర్ (42) గురువారం రాత్రి 7.30గంటల సమయంలో జేఎన్టీయూ సమీపంలోని పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్నాడు. అప్పుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

యువతి అదృశ్యం...

అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన షేక్ నసీమా అదృశ్యమయ్యారు. ఈమె ఓ షో రూమ్‌లో పనిచేసేవారు. కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం ఉదయం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో తల్లి వహీదా అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం..!

- విధులను బహిష్కరించిన కార్మికులు
- అదానీ ఫ్యాక్టరీలో గోప్యంగా విచారణ
- శివకేశవ కుటుంబంలో తీవ్ర విషాదం
- గాయపడ్డవారికి బెంగళూరులో చికిత్స

యాడికి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. వేడి చల్లారిన తరువాత కూలర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా.. అప్పటికప్పుడు చేయాలని ఆ విభాగం అధికారి కార్మికులపై ఒత్తిడి తెచ్చారని, అందుకే ఘోరం జరిగిందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం గురించి అధికారులు గురువారం విచారించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి సిబ్బందిని ఆరాతీశారని సమాచారం. అధికారులు వచ్చిన సమయంలో విలేకరులను ఫ్యాక్టరీ ఆవరణలోకి అనుమతించలేదు. విచారణ రహస్యంగానే కొనసాగింది. ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ అధికారులు, ఫ్యాక్టరీ అధికారులు ఎక్కువసేపు చర్చలు జరిపినట్లు కార్మికులు చర్చించుకుంటున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోకి విలేకరులు సహా ఎవరినీ రానివ్వకుండా పోలీసు, ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది భద్రతను కట్టుదిట్టం చేశారు. జరిగిన ప్రమాదం గురించి గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు, కార్మికులు వ్యాఖ్యానించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, యాడికి సీఐ ఈరన్న ఆధ్వర్యంలో యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి స్టేషన్ల సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కుటుంబ పెద్ద దిక్కు

పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు వృద్ధాప్యంలో ఉన్న తల్లి దండ్రులు లక్ష్మిదేవి, రంగనాయకులు, భార్య గీతాదేవి, మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ ఉన్నారు. శివకేశవ తల్లిదండ్రులు కూలీలు. భార్య గీతాదేవి డీఎడ్ పూర్తి చేశారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పాఠశాలలోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు మహాదేవ్ యాదవ్‌కు మూడేళ్లు పడటంతో ఇటీవల పుట్టువెంట్రుకలు తీయించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శివకేశవ ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు, భార్య గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు దిక్కెవరని తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో వారు విలపించడం అక్కడున్నవారిని కలచివేసింది.

యాజమాన్యం నిర్లక్ష్యమే..

ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం విషయంలో యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు గురువారం విధులను బహిష్కరించారు. ఏ ఒక్కరూ లోపలికి వెళ్లకుండా, ఫ్యాక్టరీ ప్రధానగేటు సమీపంలో ఉండిపోయారు. ఫ్యాక్టరీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధిత కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందని వారు అన్నారు. చెడిపోయిన కూలర్‌లో వేడి తగ్గేదాకా ఆగి, 24 గంటల తర్వాత కార్మికులను మరమ్మతు పనులకు లోపలకి పంపించాల్సి ఉందని అన్నారు. త్వరగా మరమ్మతు చేయించాలని ఫ్యాక్టరీ అధికారి ఒత్తిడి చేయడంతోనే కార్మికులు కూలర్ డోర్ తెరిచారని, దీంతో ఒక్కసారిగా లోపల బ్లాస్ట్ జరిగిందని అన్నారు. బ్లాస్ట్ జరిగిన సమయంలో కూలర్‌కు ఉన్న ఇటుకలు, బొగ్గుపొడి కార్మికులపై పడటంతో ఒకరు మృతిచెందారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.



హాస్పిటల్ వద్ద రోదిస్తున్న శివకేశవ కుటుంబ సభ్యులు

అమ్మ ఒడిలో చిన్నారి..

శివకేశవ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే సమయంలో ఆయన మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ తల్లి ఒడిలో నిద్రిస్తూ కనిపించాడు. బాలున్ని చూసిన వారందరూ 'పాపం పిల్లవాడు.. వాళ్ల నాన్న చనిపోయాడని ఎలా తెలుస్తుంది..' అని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.30 లక్షల పరిహారం.. ఉద్యోగం

ప్రమాదంలో మృతిచెందిన శివకేశవ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వనున్నారు. శివకేశవ భార్యకు ఉద్యోగం, నెలకు రూ.10వేల దాకా పెన్షన్ అందిస్తారని తెలిసింది. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి కిష్టిపాడు గ్రామంలో రెండు ఎకరాల భూమిని కేటాయించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

బెంగళూరులో చికిత్స


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు షణ్ముకానందరెడ్డి, దీపక్‌సేన్, కంబగిరిరాముడు, బికాస్‌సాహు బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో షణ్ముకానందరెడ్డి, దీపక్‌సేన్‌కు శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని తెలిసింది. కంబగిరి రాముడు, బికాస్‌సాహు ఆరోగ్య పరిస్థితి బాగున్నట్లు తెలిసింది.

కేసు నమోదు

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై బాధితుడు, యాడికి మండలం చింతలాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని యాడికి యూపీఎస్ సీఐ ఈరన్న గురువారం తెలిపారు. బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్ చెడిపోయిందని, తక్షణమే మరమ్మతు చేయాలని సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారి ఆదేశించడంతో ఆరుగురు కార్మికులం మరమ్మతులు చేయడానికి బుధవారం రాత్రి వెళ్లామని బాధితుడు తెలిపారని సీఐ వివరించారు. కూలర్ వద్ద ఉన్న డోర్ తెరవడంతో ఒక్కసారిగా వేడి వేడి ఇటుకలు, బొగ్గుపొడి వచ్చిమీద పడిందని, దీంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఫ్యాక్టరీ సిబ్బంది వెంటనే వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారని తెలిపారు.



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దారు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.77	1,590.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,948	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,692	1,905
నీటి నిల్వ (టీఎంసీలు)	89.51	11.10

టమోటా @ రూ.2

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి దాకా ధరలు పడిపోవడంతో టమోటా రైతు ఆవేదనకు అంతు లేకుండా పోయింది. మార్కెట్‌లో టమోటా ధర ఉన్న ఫళంగా పడిపోవడంతో రైతులు నష్టాలకు టమోటాను అమ్ముకోలేక రోడ్డుపై పడేసి పోతున్నారు. గురువారం విజయనగర జిల్లా కొట్టూరు గ్రామానికి గాబరి కాడప్ప తనకున్న ఎకరా పొలంలో టమోటాను సాగుచేశాడు. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి సాగుచేసిన మార్కెట్‌లో ధర లేక పోవడంతో విసుగు చెంది మార్కెట్‌కు తీసుకొచ్చిన 30 బాక్సుల టమోటా ను రోడ్డుపై విసిరేసి వెళ్ళిపోయాడు. గత వారం 20 కేజీల టమోటా ధర రూ 400 నుంచి రూ 500 పలుకగా, ప్రస్తుతం బాక్సు ధర రూ 50 నుంచి 70రూపాయలకు పడిపోయింది. ఎకరాకు రూ 50వేల రూపాయలు పైగానే ఖర్చుచేసి పండించిన పంటకు ధర లేకపోవడంతో అన్నదాత ఆవేదనకు అంతు లేకుండా పోయింది. ఈ ధరతో అమ్మితే కనీసం రవాణా ఖర్చులు కూడా రావని, పశువులకైనా ఉపయోగపడుతాయనే రోడ్డుపై పడేసి పోతున్నాట్లు తెలిపారు. అప్పు చేసి వేలాది రూపాయలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన టమోటా విత్తనాలు, వాటి కోసం ఉపయోగించిన రసాయన మందులు కోసం వేలాది రూపాయలు ఖర్చుపెట్టినా... టమోటా కోత దశలో ఉన్నపుడు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు కష్టాల కడలిలో మునిగి పోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టమోటా రైతులను ఆదుకునేందుకు రైతులు ముందుకు రావాలని, హారకనాళ గ్రామానికి చెందిన రైతు వీరభద్రయ్య డిమాండ్ చేస్తున్నాడు.

చీనీ.. టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడుపోయాయి.

636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 636 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 317 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, పెళ్లి కాలేదని మనస్తాపం చెందిన ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం చేనేత కార్మికుడు కిరణ్ (36) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పరిధి పోతుకుంట బ్రిడ్జి సమీపాన రైలు కింద పడి మరణించాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌కు చెందిన పుల్లయ్య కుమారుడు కిరణ్ కూలిమగ్గం నేస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండేవాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వారి బాధ్యత కిరణ్‌పై పడింది. ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉన్నారు. అప్పులు చేసి, పెద్ద చెల్లెలికి వివాహం చేశాడు. రెండో చెల్లెలు ఎంసీఏ పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తోంది. కిరణ్ వివాహం చేసుకుందామంటే ఎవరూ అమ్మాయిని ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆత్మహత్య చేసుకున్నాడు.

వృత్తివిద్యపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

● జిల్లా నోడల్ అధికారి తిప్పేస్వామి

బళ్లారి సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యపై పిల్లలకు అవగాహన తప్పనిసరి అని, పాఠశాల స్థాయి నుంచే వాటి గురించి తెలుసుకోవాలి జిల్లా నోడల్ అధికారి తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాల, కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ కర్ణాటక, యునైటెడ్ ఎఫర్ట్ ఫౌండేషన్ బెంగళూరు సహకారంతో అమలు చేయబడిన మై కెరీర్ మై చాయిస్ ప్రోగ్రాం ప్రారంభించి ఆయన మాట్లాడారు. పదవతరగతి ముగిసిన తర్వాత చేపట్టవలసిన కోర్సులపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. అతిథిగా విచ్చేసిన నాగరాజ్ యాదవ్ మాట్లాడుతూ ఏ వృత్తినైనా ఎంపిక కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి వారి ఆసక్తిని తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయం, ఫుడ్ సోషల్ వంటి12 రంగాలకు సంబంధించిన వర్క్ బుక్‌లోని అంశాలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే వృత్తులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా కన్నడ ఉపాధ్యాయురాలు సిద్దేశ్వరి మాట్లాడుతూ పిల్లల జీవితంలో వృత్తి విద్య ఎంతో అవసరమని వారి కలలను సాకారం చేసేందుకు దోహద పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో రాజాభక్షి ,నాగవేణి, ఉపాధ్యాయులు నాగప్ప, హొన్నూరప్ప ,మల్లప్పఆనంద ఉపాధ్యాయులు సిద్వేశ్వరీ , శోభ,సంగీత ,జానకీ తదితరులున్నారు.



వర్క్ బుక్ విడుదలలో నోడల్ అధికారి తిప్పేస్వామి, హెడ్‌మాస్టర్ వెంకటేశ్

నిర్బంధ విద్య చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

● కర్ణాటక టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

బళ్లారి సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంఆర్టికల్ 21 సవరణ ప్రకారం 6నుంచి 14ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యా చట్టం అమల్లో ఉందని, దానికి కఠినంగా అమలు చేయాలని కర్ణాటక టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవిచెళ్ళగుర్కి అన్నారు. గురువారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాజ్యాంగంపై చేసిన ప్రసంగం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను విశ్వవ్యాప్తంగా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేసినా 96శాతం ప్రగతి సాధించామన్నారు.దేశంలో ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా చేయిచేయి కలిపి విద్యను అందిస్తున్నాయన్నారు. విద్యతోనే దేశ ప్రగతి సాధించవచ్చన్న వాస్తవాన్ని గ్రహించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1968లో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేశారని, తర్వాతమాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 1986లో స్వల్ప మార్పులతో కొత్త జాతీయ విద్యా విధానాన్ని అమలులోకి తెచ్చారన్నారు. 34సంవత్సరాల తర్వాత ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ విద్యా విధానం 2020లో అమలు చేశారన్నారు. నలంద ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన విశ్వవిద్యాలయం అని, దేశంలో 1956లోనే 20 విశ్వ విద్యాలయాలు ఉండడం విశేషమన్నారు. నేడు మన దేశంలో దాదాపు 864 విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాలు వినియోగించుకుని, ఉత్తమ విద్యను సాధించాలన్నారు. అనంతరం రాజ్యాంగ పీఠికను ఉత్తమంగా చదివిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, విజయ,కె, సుమ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి పంపిణీ చేస్తున్న రవిచెళ్లగుర్కి

బాలుడిని మింగిన నిర్లక్ష్యం..!

మురుగు గుంతలో తేలిన శవం..

కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మృతి చెందిన మహ్మద్ అల్మాస్ (ఫైల్)



మృతికి కారణమైన మురుగునీటి గుంత ఇదే

పెనుకొండ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలుడి అదృశ్యం విషాదాంతమైంది. నాలుగేళ్ల పసివాడిని నిర్లక్ష్యం పొట్టనబెట్టుకుంది. ఆడుకుంటూ వెళ్లి మురుగు గుంతలో పడి మరణించినట్లు తేలింది. మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికితీశారు. దీంతో బాలుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవాలకు వేలాదిగా జనం వస్తారని తెలిసినా.. కాంట్రాక్టర్ పెద్ద గుంత తవ్వి, అందులోకి మురుగు నీరు వదిలారు. అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దానిపై కప్పు కూడా వేయలేదు. ఆ నిర్లక్ష్యమే బాలుడిని బలిగొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండలో బాబయ్యస్వామి ఉరుసు జరుగుతోంది. కర్ణాటకలోని చిత్రదుర్గ పట్టణానికి చెందిన జాఫర్.. భార్య సల్మా, కుమారులు ఫర్హాన్, మహ్మద్ అల్మాస్ (4), బంధువులు పర్వీన్, గుల్జార్‌బానుతో కలిసి ఈనెల 17న ఉరుసుకు వచ్చారు. అదేరోజు సాయంత్రం మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్గా వెనుకభాగంలో మురుగునీరు వెళ్లేందుకు పెద్ద గుంత తవ్వారు. పోలీసులకు అనుమానం వచ్చి అందులోని నీటిని బుధవారం కొంతవరకు తోడించారు. గురువారం ఉదయం బాలుడి శవం తేలింది. పోలీసులు బయటకు తీశారు. అది అదృశ్యమైన బాలుడిదేనని కుటుంబీకులు గుర్తించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ మహబూబ్ బాషా.. మురుగునీటి కోసం పెద్దగుంత తీశాడు. మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ వెళ్లి అందులో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యులపై చర్యలు: వెంకటేశ్వర్లు, డీఎస్పీ

దర్గా పరిధిలో మురుగునీటి నిర్వహణకు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. మృతికిగల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటాం.

రూ.15 వేలు లంచం తీసుకుంటూ..

రాయచూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ హాస్టేల్ అద్దెకు సంబంధించి లంచం తీసుకుంటూ సంక్షేమ శాఖ అధికారి సంగబసప్ప లోకాయుక్త అధికారులకు గురువారం పట్టుబడ్డాడు. జిల్లాలోని మాన్వి పట్టణంలో ఉన్న బీసీ సంక్షేమ శాఖ విద్యార్థి వసతి గృహం ఒక ప్రైవేటు భవనంలో నిర్వహిస్తుండగా అందుకు సంబంధించి ప్రభుత్వం గత 9 నెలలుగా బాడుగ బకాయి ఉంచింది. ఈ విషయంలో ఇటీవల ప్రభుత్వం 7 నెలలకు సంబంధించిన అద్దెను మంజూరు చేయగా అందుకు రూ.43 వేలు తనకు లంచం ఇవ్వాలంటు సంగబసప్ప సంబంధిత గృహం యజమానిని డిమాండ్ చేశాడు. అయితే యజమాని మధ్యవర్తుల ద్వార రాయబారం చేసి రూ.15 వేలే లంచం ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. ఈ విషయం లోకా యుక్త అధికారుల దృష్టికి తీసుకురాగా ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా దాడి చేసి పట్టుకున్నారు.

జిందాల్ కంపెనీకి హైకోర్టులో చుక్కెదురు

● ప్రభుత్వం నుంచి భూములు పొందడంపై నోటీసులు

బళ్లారి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ధార్వాడ హైకోర్టులో జిందాల్ కంపెనీకి చుక్కెదురయ్యింది. రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి సంస్థలు ప్రారంభించక పోవడంపై నోటీసులు జారీ చేసింది. పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తామని చెప్పి గతంలో ప్రభుత్వం భూములు కొనుగోలు చేసింది. తోరణగల్లు, కురేకుప్ప, తదితర గ్రామాల పరిధిలో 3,677 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసింది. అయితే అక్కడ ప్రభుత్వం చెప్పినట్లు ప్రభుత్వ కంపెనీ ఏర్పాటు చేయకుండా ఆ భూమిని ప్రైవేటు కంపెనీ అయిన జిందాల్‌కు అప్పగించారు. దీన్ని సవాల్ చేస్తూ మంజునాథ్ అనే వ్యక్తితో పాటు మొత్తం 30 మంది రైతులు కోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కోర్టు గురువారం జిందాల్ కంపెనీతో పాటు భూమిని అమ్మిన ప్రభుత్వ శాఖ అధికారులకు, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కంపెనీ నిర్మించకుండా ప్రైవైట్ సంస్థలకు అప్పగించడంపై ప్రశ్నించింది. సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

అమరవీరులకు నివాళి



నివాళి అర్పిస్తున్న ఏఐడీఎస్‌ఓ పదాధికారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరులను నిత్యం స్మరించుకోవాలని ఏఐడీఎస్‌ఓ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం ఏఐడీఎస్‌ఓ కమిటీ ఆధ్వర్యంలోని బిమ్స్ మైదాన్‌లో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 19, 1027స్వాతంత్ర్య పోరాటంలో గొప్ప విప్లవకారులు రామ్ ప్రసాద్ బిసిష్, అశ్వకుల్లా ఖాన్‌లను బ్రిటీషు వారు ఉరితీశారని, వారి పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందన్నారు. ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు కంబలి మంజునాథ్ మాట్లాడుతూ పరమ భక్తుడైన హిందూ రామ్ ప్రసాద్ ఇస్లాంను శ్రద్ధగా అనుసరించిన అశ్వకుల్లాను బ్రిటీషు ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. బిస్మిల్, అశ్వాకుల జీవిత సందేశాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈసందర్భంగా వృద్ధులు, ప్రజలు, విద్యార్థులు వీరేశ్ , రవి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోళ్లు ప్రారంభం



ఏపీఎంసీ సమావేశంలో అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్రప్ప, పి.పాలన్న

బళ్లారి సిటీ,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీఎంసీలో కొనుగోలుదారులు వేరుశనగకు డబ్బులు చెల్లించకపోవడంతో బుధవారం నిలిచిపోయిన కొనుగోలు ప్రక్రియ ఈరోజు గురువారం మధ్యాహ్నం తర్వాత తిరిగి ప్రారంభమయ్యాయి. ఏపీఎంసీకి చెందిన అశోక్ ట్రేడర్స్ నుంచి ఆర్ఆర్ ట్రేడర్స్ టెండర్ పద్దతిలో వేరుశనగ కొనుగోలు చేశారు.అయితే లారీకి తూకం వేసి లోడ్ చేసి పంపిన తర్వాత కొనుగోలుదారు సరుకు మారిందని పేమెంట్ ఆపేశాడు. దీంతో దళారులంతా కొనుగోలు ప్రక్రియను నిలిపివేశారు. అందుకు గురువారం అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్రప్ప, బుడా మాజీ అధ్యక్షుడు పి.పాలన్న, వర్తక సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప, ఏపీఎంసీ కార్యదర్శి నంజుడస్వామి సమావేశం నిర్వహించి బ్రోకర్ అశోక్ ట్రేడర్స్‌కు రూ, 11వేల జరిమానా విధించి సంఘానికి కట్టాలని ఆదేశించారు.

ఆలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ధర్మస్థళ డైరెక్టర్ రోహిత్ అక్ష

సిరుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 1.50 లక్షల విరాళాన్ని అందజేశారు. శ్రీక్షేత్ర ధర్మస్థల సంస్థ డైరెక్టర్ రోహిత్ ఆక్ష గురువారం విరాళం చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ అధ్యక్షుడు సిద్దనగౌడ, సభ్యులు విరుపాక్షి, శివరామ్‌గౌడ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



అమిత్ షా చిత్రపటాలకు నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న దళిత సంఘాలు

బళ్లారి సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. గురువారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా హొసపేటలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా భీమవాద దళిత సంఘర్ష సమితి, స్లమ్ పీపుల్స్ సంఘం, జిల్లా చలవాది పలుసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. దళిత సంఘాల నాయకులు పర్తిమనేని సోమశేఖర్, మారెప్ప, ఈరన్న, స్లం వెంకటేశ్, పూజారిదుర్గప్ప మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. అంబేడ్కర్ జీవితం, రాజ్యాంగం పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని జిల్లా విభాగం అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఈడిగర మంజునాథ్ అన్నారు. హోం మంత్రి సిగ్గుమాలిన ప్రకటనను వెంటనే ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాయచూరులో ...

రాయచూరు డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ శాను మంత్రి పదవి నుంచి తప్పించాలని అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి డిమాండ్ చేశారు. పార్లిమెంట్‌లో అమిత్ శా చేసిన వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానపరచడమేగాక ఆయన విధానాల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అక్కసును బీజేపీకి ఉన్న వ్యతిరేఖత మరో సారి స్పష్టమైందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే నిజంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల గౌరవం ఉన్న అమిత్ శాను మంత్రి వర్గం నుంచి తొలగించడమేగాక అరెస్టు చేయాలని అంబేడ్కర్ సేన నాయకులు కోరారు. హోం మంత్రి వ్యాఖ్యలను నిరశిస్తు గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద హోం మంత్రి దిష్టిబొమ్మను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి నిరసన తెలిపిన అంబేడ్కర్ సేన యువకులు అమిత్ శా వ్యాఖ్యలు దేశంలో ఉద్దేశపూర్వకంగా విద్వేషాలు రచ్చగొట్టే రీతిలో ఉన్నాయంటు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోసూరు జోన్

ముల్లంగి దిగుబడిపై రైతుల హర్షం

హోసూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు ముల్లంగి దిగుబడి రాగా మంచి ధర పలకడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, ఒన్నలవాడి, బాగలూరు, ఉద్దన్నపల్లి, ఆవలపల్లి, కెలవరపల్లి, శూలగిరి, తదితర పరిసర ప్రాంతాల్లో తక్కువ కాలంలో పండే ముల్లంగి, టమోటా, పాలకూర, కొత్తిమీర వంటి కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే పండ్లు, కూరగాయలు బెంగళూరు, సేలం, కోయంబత్తూరు, ఈరోడ్, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం నాణ్యమైన ముల్లంగి దిగుబడి రావడంతో తోటల వద్దనే కిలో రూ.20-25 కు విక్రయిస్తున్నారు. దుకాణాలలో కిలో రూ.35-40 వరకు ధర పలుకుతోంది. రైతు బజారులో కూడా ధర ఆశాజనకంగా ఉంది.




ఎగుమతికి సిద్ధంగా ఉన్న ముల్లంగి

డీఎంకే నిరసన

హోసూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రసంగించిన కేంద్రమంత్రి అమిత్‌షా తీరును ఖండిస్తూ కృష్ణగిరి జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్ మాట్లాడుతూ అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా కౌన్సిల్ చైర్మెన్ యువరాజు, కోశాధికారి సుకుమారన్, జిల్లా ఉపకార్యదర్శి మురుగన్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు వీరారెడ్డి, జనరల్ కమిటీ సభ్యులు జయరామన్, ధనలక్ష్మి, ఆరోగ్య స్థాయిసమితి అధ్యక్షుడు మాదేశ్వరన్, పన్నుల స్థాయి సమితి అధ్యక్షుడు చెన్నీరప్ప పాల్గొన్నారు.



నిరసనలో ఎమ్మెల్యే ప్రకాశ్, డీఎంకే నాయకులు, కార్యకర్తలు



అన్బళగన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అన్బళగన్‌కు డీఎంకే ఘన నివాళి

హోసూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డీఎంకే మాజీ ప్రధాన కార్యదర్శి కె.అన్బళగన్ జయంతిని పురస్కరించుకుని డీఎంకే కృష్ణగిరి పశ్చిమజిల్లా ఆధ్వర్యంలో గురువారం ఘన నివాళులు అర్పించారు. హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్ పాల్గొని అన్బళగన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ప్రకాశ్ మాట్లాడుతూ ద్రవిడ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన అన్బళగన్ డీఎంకే పార్టీ మూడో జనరల్ సెక్రటరీగా కొనసాగారన్నారు. ప్రతిపక్షనేతగా, మంత్రిగా పలు హోదాలలో కొనసాగి పార్టీని ఇనుమడింపచేశారన్నారు. కార్యక్రమంలో హోసూరు మేయర్ సత్య, జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు యువరాజు, కోశాధికారి సుకుమారన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వీరారెడ్డి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, ట్యాక్స్ కమిటీ చైర్మెన్ చెన్నీరప్ప, డివిజన్ కార్యదర్శులు రాము, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ కోత

హోసూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణా పనుల నేపథ్యంలో ఈనెల 21న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హోసూరు పవర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ ప్రకటనలో తెలిపారు. 21న శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. గొల్లపల్లి, తిరుచ్చిపల్లి, పాతదేవాలయం హడ్కో, అతసనత్తం, పెరియార్‌నగర్, భారతీదాసన్‌నగర్, కుమరన్‌నగర్, వళ్లువర్ నగర్, కొత్త బస్టాండు, కామరాజ్ కాలనీ, అన్నానగర్, ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్డు, సీతారం నగర్, వాసవి నగర్, సిప్‌కాట్ పేస్-2 సబ్‌స్టేషన్, సిప్‌కాట్ జోన్-2 బత్తలపల్లి, కుముదేపల్లి, పెన్నామట్టం, ఎలక్ట్రానిక్స్‌టెట్, మోర్నపల్లి, ఎసామనపల్లి, ఆలూరు, బుక్కసాగరం, అదియమాన్ కళాశాల, కదిరేపల్లి, మారుతి నగర్, పేరండపల్లి, రామనందిరం, సుండట్టి, అంగేపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.